## ప్రలోభాలకు లొంగకండి..

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి

# ప్రగతికి ఓటేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్, నవంబర్ 14: మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవడం ఖాయమని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో మండల పరిధిలోని బూత్‌ల వారీగా బీఆర్‌ఎస్ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సంక్షేమానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. గడిచిన 5 సంవత్సరాల్లో రెండు సంవత్సరాలు పూర్తిగా కరోనా మహ్మారితో అభివృద్ధి నిలిచిపోయిందని, మిగిలిన 3 సంవత్సరాల్లోనే ఇంత పెద్దస్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ 50 సంవత్సరాల పాలనలో అభివృద్ధి ఏవిధంగా ఉండేదో.. నేడు బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రేవంత్‌రెడ్డి అధికారాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో అడ్డదారులు తొక్కుతూ.. ప్రజలను మరోమారు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు 6 గ్యారెంటీలు అమలు చేస్తామంటే ప్రజలకు నమ్మకం లేదన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి చేరువైయ్యారని, వారిని మభ్యపెట్టి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలనే దురుద్దేశంతో 6 గ్యారెంటీలను ప్రకటించినట్లు పేర్కొన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీ.. సీఎం కేసీఆర్‌రే ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కొడంగల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోనే అభివృద్ధి అవుతుందన్నారు. ప్రతి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వారి వారి గ్రామాల్లోనే ఉంటూ, బూత్‌ల వారీగా ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొడంగల్ ఎన్నికల ఇన్‌చార్జి నర్సింగ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రావు యాదవ్, కృష్ణ, సిద్దిలింగప్ప, రమేశ్‌బాబు, ముక్తార్‌లతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



మండల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

## రేపు మర్పల్లికి మంత్రి కేటీఆర్ రాక

### హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ రంజిత్‌రెడ్డి

మర్పల్లి, నవంబర్ 14 : ఈ నెల 16న మర్పల్లిలో రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ రోడ్‌షో నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంసీఎం ఫంక్షన్‌హాలులో మండల నాయకులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు

## ఇప్పాయిపల్లి యువకుడు ఎంపిక

కులకచర్ల, నవంబర్ 14 : కులకచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన జంగం యాదయ్య కుమారుడు అఖిల్‌గౌడ్ ఈ నెల 11, 12వ తేదీన గుజరాత్‌లో జరిగిన అండర్ 19 వాలీబాల్ క్రీడల్లో జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యాడు. దీంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



అఖిల్‌గౌడ్

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ అధికారి

ధారూరు, నవంబర్ 14: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ అధికారులు టి.వెంకటేష్, పి.రాము అన్నారు. మంగళవారం ధారూరు మండల పరిధిలోని గడ్డమీది గంగారం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరంగా పరిగణిస్తారని, తల్లిదండ్రులు పనికి పంపితే వెంటనే టీచర్స్‌కి చెప్పాలన్నారు. చిన్న పిల్లల రక్షణ కోసం చట్టాలు ఉన్నాయని, కోర్టులు వారి హక్కుల కొరకు పనిచేస్తున్నాయని తెలిపారు. వారికై నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్కీం 2015 అందుబాటులోకి తెచ్చిందని ఈ చట్టం ద్వారా ఎలాంటి ఫీజు లేకుండా వారి ఇబ్బందుల పరిష్కారం కొరకు న్యాయ సేవా అధికార సంస్థలు పని చేస్తున్నాయని చెప్పారు. మైనర్ బాలికల రక్షణ కోసం పోక్సో (POCSO)చట్టం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## మొక్కలను సంరక్షించాలి



మోమిన్‌పేట, నవంబర్ 14 : నర్సరీలో మొక్కలను జీవామృతంతో పెంచాలని డీఆర్డీవో కృష్ణ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట మండలంలోని వెల్చాల్, ఎన్కెపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలను తనిఖీ చేశారు. మొక్కలు ఏపుగా పెరగడానికి పోషక పదార్థాలు లభించే జీవామృతం తయారు చేసి మొక్క మొక్కకు అందించాలని సూచించారు. త్వరగా అన్ని గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో జీవామృతం తయారు చేసి అందుబాటులో ఉంచుకోవాలి, ప్రతి మొక్కను సంరక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఏపీవో శంకర్, ఈసీ వికాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# ఆలయాలకు కార్తిక శోభ

శివకేశవులకు ప్రీతికరమైన
మాసం.. కార్తికం
ప్రతిరోజూ పుణ్యప్రదమే
ఈ మాసం దీపారాధనకు ప్రశస్త్యం



షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 14 : భక్తిపారవశానికి అత్యంత పవిత్ర, మహిమాన్వితమైన మాసం కార్తిక మాసం. ఈ మాసంలో మాలధారణలు, ఉపవాస దీక్షలు, వ్రతాలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతారణం నెలకొంటుంది. శివకేశవులకు విశేష పూజలు జరుగుతాయి. కార్తిక మాసం మొదట్నుంచే ఆకాశ దీపం ప్రారంభమవుతుంది. ఉభయ సంధ్యలలో గృహం, పూజా మందిరం, తులసి సన్నిధి, దేవాలయాల్లో దీపారాధన చేయడం ద్వారా ఇహ, పర సౌఖ్యాలను కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. ఆధ్యాత్మిక ధార్మిక యోచనలు కలిగిన ప్రజలు ఒంటిపూజ భోజనం, నిరాహారాది వ్రతాలు చేస్తారు. రాత్రుల్లో దేవాలయాలు, తులసి వద్ద దీపాలను వెలిగిస్తారు. కార్తిక మాసం విశేష పూజలతో దేవాలయాలన్ని కార్తిక శోభను సంతరించుకుంటున్నాయి. ప్రతిరోజూ పుణ్యప్రదం, అధ్యాయం పారాయణం చేయడం శుభకరమని అర్చకులు చెబుతున్నారు.

**ఎంతో విశిష్టత కలిగిన మాసం**

శివకేశవులకు ప్రీతికరమైన ఈ కార్తిక మాసానికి ఎంతో విశిష్టత ఉంది. కృతిక నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించుట ద్వారా ఈ మాసానికి కార్తిక మాసమనే పేరు వచ్చింది. కార్తిక మాసంలో ఉభయ పక్షములందు అనేక వ్రతాలు ఉన్నాయి. అయ్యప్ప దీక్ష ఈ నెలలో ప్రారంభమై మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది.

**పూజలు, వ్రతాలు**

ఆలయాల్లో రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు విశేషంగా జరుపుతారు. విశేషార్చనలు జరిపై భక్తులకు సదాశివుడు ప్రసన్నుడై వారి అభిష్టాలను తీరుస్తాడు. అదే విధంగా ఈ మాసంలో విష్ణువును దామోదర నామంతో పిలుస్తారు. కార్తిక దామోదర ప్రీత్యర్థం అని ఈ మాసాన వ్రత దీక్షను ఆచరించాలి. తులసి చెంత హరిపూజ, సత్యనారాయణ వ్రతం, విష్ణు సహస్రనామ పారాయణం, రుద్రాభిషేకాలు చేయడం పుణ్యప్రదం. శివకేశవుల అనుగ్రహానికి ఈ మాసం ఎంతో ఉత్కృష్టమైంది.

**శుభ ఫలితాలు**

కార్తిక మాసంలో ఏ మంత్ర దీక్ష తీసుకున్నా మంచి ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. అభిషేక ప్రియఃశివః మనస్సులో భక్తిని ఉంచుకొని శివుడ్ని ధ్యానిస్తూ చేసే అభిషేకంతో శివుడు ప్రీతి చెందుతాడు. శివాభిషేకం అన్ని దోషాలను పోగొట్టి సకల శుభాలను కలగజేస్తుంది. ఈ మాసంలో శివార్చన చేసిన వారికి గ్రహదోషాలు, ఈతిబాధలు ఉండవు. శివుడిని బిల్వదళంతో పూజించిన అత్యంత శుభప్రదం. ఈ మాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నానం చేసి తులసి కోట ముందు దీపారాధన చేసి గౌరీ దేవిని పూజిస్తే ఈశ్వరానుగ్రహంతో సౌభాగ్యాన్ని, సకల శుభాలు కలుగుతాయి.

**ఈ మాసం దీపారాధనకు ప్రశస్త్యం**

ఈ కార్తిక మాసం దీపారాధనకు ప్రశస్త్యం. దీపరానకు ముందు ఆవునెయ్యి ఉత్తమం, మంచి నూనె మద్యమం. వన భోజనాలు ఈ మాసానికి మరో విశిష్ణత. ఉసిరి చెట్టు లక్ష్మీదేవికి నివాసం. కార్తిక మాసంలో ఈ ఉసిరిక వృక్షం కింద భోజనం చేయడం ఎంతో అభిష్టాన్నిస్తుంది. ఉసిరి వృక్షం మొదట్లో లక్ష్మీదామోదరులను పూజించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరి చెట్టు ఉన్న వనంలో భోజనాలు చేయడం వన భోజనాలుగా ప్రసిద్ధి చెందింది. ఇందులో ఉత్థాన ఏకాదశి, క్షీరాబ్ధి ద్వాదశి, కార్తిక పౌర్ణమి అత్యంత విశిష్టమైనవి, శ్రీ మహా విష్ణువు ఉత్థాన ఏకాదశి రోజున యోగ నిద్ర నుంచి మేల్కొంటాడని విశ్వసిస్తారు. దేవ దానవులు పాల సముద్ర మధనం చేసిన రోజు క్షీరాబ్ధి ద్వాదశి. దేవాలయాల్లో జ్వాల తోరణం వెలిగిస్తారు. ఈ రోజున నదీస్నానం, దేవాలయ దర్శనం, ఉపవాసం విధిగా ఆచరించడం ద్వారా విశేష ఫలితాలను పొందుతారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ గిరిజామృత లింగేశ్వరస్వామి

**ప్రారంభమైన కార్తిక మాసం**

కార్తికమాసం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఆలయాల్లో ప్రతిరోజూ నిర్వహించే పూజా కార్యక్రమాలతో కార్తిక శోభను సంతరించుకోనున్నాయి. ఆలయాలు, తులసి చెంత దీపారాధన, వ్రతాలు చేయడం, వన భోజనాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. పట్టణంలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలోని శ్రీ గిరిజామృత లింగేశ్వరస్వామికి, వివిధ ఆలయల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.

**విశిష్టమైనది కార్తిక మాసం**



తెలుగు మాసాల్లో విశిష్టమైనది కార్తిక మాసం. కైలాస నిలయుడైన పరమశివుడికి ప్రీతిపాత్రం ఈ మాసం. ఆధ్యాత్మిక పరంగా ఆరోగ్యప్రదమైన మాసం. ఈ మాసంలో సోమవారం రోజున ఉపవాసం, రాత్రి నక్షత్ర దర్శనం చేసి భోజనం చేస్తారు. ఇలా చేయడం ద్వారా అష్టైశ్వర్య ప్రాప్తి కలుగుతుందని ధర్మసింధువు గ్రంథం చెబుతుంది. ఈ మాసంలో ప్రతి రోజూ పర్వదినమే అయినప్పటికీ కొన్ని ముఖ్యమైన పర్వదినాలు మరింత ఫలప్రదమైనవి. అవే భగినీ హస్తభోజనం, ఏకాదశి, క్షీరాబ్ధి ద్వాదశి, కార్తిక పౌర్ణమి. ఈ కార్తికం అత్యంత పవిత్ర మహిమాన్వితమైన మాసం.

-ఎం. సంతోశ్‌శాస్త్రి,
అర్చక పురోహిత జ్యోతిష్కులు, షాద్‌నగర్